సాక్షి
వరంగల్
సోమవారం । 21 । అక్టోబర్ । 2024



ఉమ్మడి జిల్లాలో సీసీఐ కొనుగోలు కేంద్రాలు

కాటన్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా (సీసీఐ) ఉమ్మడి జిల్లాలో పత్తి కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేస్తోంది. - 8లో▸



అంతర్జాతీయ క్రికెట్ స్టేడియానికి కృషి - 8లో▸

వరంగల్ నగరంలో అంతర్జాతీయ స్థాయి క్రికెట్ స్టేడియం ఏర్పాటుకు కృషి చేస్తానని పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి అన్నారు.

గరిష్టం/కనిష్టం
29°/23°

వాతావరణం

జిల్లాలో ఉదయం నుంచి ఆకాశం మేఘావృతమై ఉంటుంది. మధ్యాహ్నం తర్వాత చిరుజల్లులు కురుస్తాయి. సాయంత్రం ఆహ్లాదకరంగా ఉంటుంది.

న్యూస్‌రీల్

నాలుగు కిలోల గంజాయి స్వాధీనం

సంగెం: వాహనాల తనిఖీల్లో నాలుగు కిలోల గంజాయి పట్టుకున్నట్లు గీసుకొండ సీఐ ఎ.మహేందర్ తెలిపారు. గొర్రెకుంట క్రాస్‌వద్ద ఎస్సై కుమార్ ఆదివారం వాహనాలు తనిఖీ చేస్తుండగా కీర్తినగర్ కాలనీకి చెందిన నాగుల విజయ్ అనుమానాస్పదంగా కనిపించాడు. అతడి చేతిలో ఉన్న ప్లాస్టిక్ బ్యాగును తనిఖీ చేయగా సుమారు రూ.లక్ష విలువైన నాలుగు కిలోల గంజాయి లభించింది. విజయ్‌పై కేసు నమోదు చేసినట్లు సీఐ ఎ.మహేందర్ తెలిపారు.

పేకాట స్థావరంపై పోలీసుల దాడి



నర్సంపేట రూరల్: పేకాట స్థావరంపై పోలీసులు దాడి చేసిన సంఘటన నర్సంపేట పట్టణంలోని సర్వాపురంలో ఆదివారం జరిగింది. టౌన్ సీఐ రమణమూర్తి తెలిపిన వివరాల ప్రకారం.. సర్వాపురంలో మున్సిపాలిటీ వైస్‌చైర్మన్ మునిగాల వెంకట్‌రెడ్డి నివాసంలో పేకాడుతున్నారన్న సమాచారం మేరకు దాడులు నిర్వహించారు. 33,360 రూపాయల నగదు, 9 సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకుని, 10 మందిని అరెస్ట్ చేసినట్లు తెలిపారు. మున్సిపల్ వైస్ చైర్మన్ మునిగాల వెంకట్‌రెడ్డి, బీజేపీ పట్టణ అధ్యక్షుడు, కౌన్సిలర్ శీలం రాంబాబుగౌడ్, బీఆర్‌ఎస్ నాయకులు కోమండ్ల గోపాల్‌రెడ్డి, ముత్తోజీపేట మాజీ సర్పంచ్ గోలి శ్రీనివాస్‌రెడ్డి, మద్దిసాగర్‌రెడ్డి, చిలువేరి శ్రీనివాస్, కోమండ్ల కరుణాకర్‌రెడ్డి, పేరాల సమ్మారావు, వేణుముద్దల దేవేందర్, నంద్యాల సురేశ్‌రెడ్డిని అరెస్ట్ చేసినట్లు సీఐ పేర్కొన్నారు. దాడుల్లో ఎస్సైలు రవికుమార్, గూడ అరుణ్, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

అభివృద్ధి పనులు పూర్తిచేయాలి



నల్లబెల్లి: నాబార్డు, సహకార సంఘం నిధులతో చేపట్టిన అభివృద్ధి పనులు త్వరితగతిన పూర్తిచేయాలని డీసీఓ నీరజ అన్నారు. నల్లబెల్లి సహకారం సంఘం పరిధిలో చేపట్టిన అభివృద్ధి పనులను చైర్మన్ చెట్టుపల్లి మురళీధర్‌తో కలిసి ఆదివారం ఆమె పరిశీలించారు. ఈ సందర్భంగా డీసీఓ మాట్లాడుతూ సహకార సంఘాల బలోపేతానికి పాలకవర్గాలు కృషి చేయాలని సూచించారు. ధాన్యం కొనుగోలు కేంద్రాల ఏర్పాటు కోసం అవసరమైన ఏర్పాట్లు చేయాలని సిబ్బందిని ఆదేశించారు. ఆమె వెంట సూపరింటెండెంట్ రవికిరణ్, సీనియర్ అసిస్టెంట్ మలహల్‌రావు, ఏఈఓ మోహన్, నల్లబెల్లి సీఈఓ ఎల్లన్న తదితరులు ఉన్నారు.

ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరిస్తా

కాళోజీ సెంటర్: జీఓ 317తో ఇబ్బందులు పడుతున్న ఉపాధ్యాయులకు మేలు చేస్తానని, ఎస్ఎస్ఏ ఉద్యోగులకు ఎంటీఎస్ ఇప్పిస్తానని పీఆర్‌టీయూ తెలంగాణ వ్యవస్థాపక అధ్యక్షుడు గాలిరెడ్డి హర్షవర్ధన్‌రెడ్డి అన్నారు. నగరంలో ఆదివారం ఏర్పాటు చేసిన యూనియన్ సమావేశంలో ఆయన మాట్లాడారు. విద్యారంగంలో పనిచేస్తున్న ఉద్యోగుల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తెచ్చి పరిష్కరించడానికి తనవంతు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. సీఎం ఆదేశిస్తే వరంగల్, నల్లగొండ, ఖమ్మం నియోజకవర్గ ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికలో పోటీ చేస్తానని తెలిపారు. మొదటి ప్రాధాన్యత ఓటు వేసి గెలిపిస్తే ఉపాధ్యాయుల గొంతుకై ప్రభుత్వంతో మాట్లాడి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. సమావేశంలో పీఆర్‌టీయూ తెలంగాణ వరంగల్ జిల్లా శాఖ అధ్యక్షురాలు కె.సంగీత, ప్రధాన కార్యదర్శి శ్రీనివాస్‌రెడ్డి, ఉమ్మడి జిల్లా గౌరవ సలహాదారులు మాలోత్ సారయ్య, అసోసియేట్ రాష్ట్ర అధ్యక్షురాలు ప్రతిభ, నాయకులు పాల్గొన్నారు.

సింహపురి ఎక్స్‌ప్రెస్ వేళల్లో మార్పు

కాజీపేట రూరల్ : కాజీపేట జంక్షన్ మీదుగా సికింద్రాబాద్–గూడూరు మధ్య ప్రయాణించే సింహపురి ఎక్స్‌ప్రెస్ వేళల్లో మార్పులు చేసినట్లు ఆదివారం రైల్వే అధికారులు తెలిపారు. ఈనెల 18 నుంచి సికింద్రాబాద్–గూడూరు(12710) సింహపురి ఎక్స్‌ప్రెస్ ప్రతి రోజు కాజీపేట జంక్షన్‌కు రాత్రి 11.49 గంటలకు, గూడూరు–సికింద్రాబాద్(12709) సింహపురి ఎక్స్‌ప్రెస్ రోజూ తెల్లవారుజామున 2.28 గంటలకు కాజీపేట జంక్షన్‌కు చేరుకుంటుందని వారు పేర్కొన్నారు.

ఈ–కేవైసీ @ 86.25%



- నమోదుకాకపోతే నరుకులు పొందడం కష్టమే
- పలు కారణాలతో లబ్ధిదారులు రేషన్‌కు దూరం
- జిల్లాలో చౌకధరల దుకాణాలు : 509
- రేషన్ కార్డులు : 2,66,661
- లబ్ధిదారుల సంఖ్య : 7,87,558



నెక్కొండలో ఈ–కేవైసీ కోసం రేషన్ దుకాణానికి వచ్చిన కుటుంబ సభ్యులు (ఫైల్)

నెక్కొండ: ప్రజాపంపిణీ వ్యవస్థలో మరింత పారదర్శకత కోసం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు మరోసారి రేషన్‌కార్డుల ఈ–కేవైసీ నమోదు ప్రక్రియకు శ్రీకారం చుట్టాయి. కార్డులు జారీచేసి ఏళ్లు గడుస్తున్న నేపథ్యంలో ఈ నిర్ణయం తీసుకున్నాయి బియ్యం పంపిణీ పక్కదారి పట్టకుండా రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక చర్యలు చేపట్టింది. ఇందులో భాగంగా జిల్లా వ్యాప్తంగా ఈ–కేవైసీ నమోదు ఏడాది నుంచి కొనసాగుతూనే ఉంది. గడువు ముగిసినా నమోదు చేసుకోని వారికి ఇబ్బందులు తప్పవని అధికారులు పేర్కొంటున్నారు.

జిల్లాలో మూడు ఎంఎల్ఎస్ పాయింట్లు..

రేషన్ కార్డుదారుల్లో ఎవరైనా ఒకరు మాత్రమే దుకాణానికి వెళ్లి ఫింగర్ ప్రింట్, ఐరిస్ ద్వారా బియ్యం తీసుకుంటున్నారు. దాదాపు పదేళ్ల క్రితం కార్డులు జారీ చేశారు. ఈ నేపథ్యంలో లబ్ధిదారులకు పూర్తిస్థాయిలో బియ్యం అందుతున్నాయా, అనర్హులు ఎవరైనా బియ్యం తీసుకుంటున్నారా వంటి వివరాలు తెలుసుకునేందుకే ఈ–కేవైసీ నమోదు ప్రక్రియకు ప్రభుత్వాలు శ్రీకారం చుట్టాయి. జిల్లాలో మూడు ఎంఎల్ఎస్ పాయింట్స్ ఉన్నాయి. వరంగల్ ఎంఎల్ఎస్ పాయింట్ ద్వారా 192 రేషన్ షాపులు, నర్సంపేట ద్వారా 182, వర్ధన్నపేట ద్వారా 135 రేషన్ షాపులకు 4,26,760 మెట్రిక్ టన్నుల రేషన్ బియ్యం సరఫరా చేస్తున్నారు.

వృద్ధులు, దివ్యాంగులకు ఐరిస్..

జిల్లాలో కార్డుదారుల ఈ–కేవైసీ నమోదు ప్రక్రియ కొనసాగుతోంది. ఇందుకోసం సమీప రేషన్ షాపులో నమోదు చేసుకునే వీలు ఉంటుంది. వేలి ముద్రలుపడని వృద్ధులు, దివ్యాంగులకు ఐరిస్ ద్వారా నమోదు చేయనున్నారు. కొంతమంది ఆధార్‌కార్డు అప్‌డేట్ లేక ఈ–కేవైసీ నమోదు కావడం లేదు. అలాంటి వారు ఆధార్ సెంటర్‌కు వెళ్లి తమ ఆధార్ కార్డు అప్‌డేట్ చేసుకోవాలని సంబంధిత అధికారులు సూచిస్తున్నారు.

నమోదు చేసుకోని 13.75 శాతం మంది..

జిల్లా వ్యాప్తంగా రేషన్ షాపులు 509 ఉన్నాయి. మొత్తం 2,66,661 రేషన్‌కార్డుల్లో 7,87,558 మంది లబ్ధిదారులు ఉన్నారు. ఒక్కొక్కరికి 6 కిలోల చొప్పున బియ్యం పంపిణీ చేస్తున్నారు. ఇప్పటి వరకు 86.25 శాతం మంది ఈ–కేవైసీ నమోదు చేసుకున్నారు. మిగిలిన 13.75 శాతం మంది లబ్ధిదారులు తమ వేలిముద్రలు వేయాల్సి ఉంది.

దుర్వినియోగం తగ్గించేందుకే...

తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు తర్వాత రేషన్ కార్డుల పునరుద్ధరణ ప్రక్రియ చేపట్ట లేదు. కార్డుల్లో పేరున్న వారిలో కొందరు మరణించడం, ఆడపిల్లల పెళ్లి జరగడం, మగ పిల్లలు పెళ్లి చేసుకొని కుటుంబాల నుంచి విడిపోవడం వంటి సంఘటనలు చోటుచేసుకున్నాయి. ఈ ప్రకారం కుటుంబ సభ్యుల్లో కొందరు లేకున్నా ప్రతి నెలా బియ్యం మాత్రం ఒక్కొక్కరికి ఆరు కిలోల చొప్పున యథాతథంగా పంపిణీ చేస్తున్నారు. దీంతో దుర్వినియోగాన్ని తగ్గించేందుకు ప్రభుత్వం దృష్టి సారించింది. త్వరలో లబ్ధిదారులకు డిజిటల్ రేషన్ కార్డుల అందించేందుకు ప్రభుత్వం చర్యలు చేపట్టనుంది. డిజిటల్ ప్రక్రియ ప్రారంభమైతే ప్రభుత్వం జారీ చేసిన కార్డుల్లో ఈ–కేవైసీ నమోదు చేసుకోని వారి పేర్లు తొలగించి, మిగిలి వారివే ఉంటాయని అధికారులు పేర్కొంటున్నారు.

మండలాల వారీగా ఈ–కేవైసీ నమోదు శాతం వివరాలు..

పర్వతగిరి	87.70
వర్ధన్నపేట	87.14
నర్సంపేట	89.18
సంగెం	88.24
ఖిలావరంగల్	84.89
రాయపర్తి	87.07
గీసుకొండ	87.92
నల్లబెల్లి	88.15
చెన్నారావుపేట	89.38
వరంగల్	83.01
ఖానాపురం	87.08
నెక్కొండ	88.80
దుగ్గొండి	87.17

ఆధార్, రేషన్‌కార్డులు తీసుకురావాలి



ఈ–కేవైసీకి వచ్చేవారు ఆధార్, రేషన్‌కార్డులు తీసుకురావాలి. మండలంలో 88.80 శాతం మంది ఈ–కేవైసీ నమోదు చేయించుకున్నారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు రేషన్‌కార్డులో పేర్లు ఉన్న వారు తప్పనిసరిగా రేషన్ షాపుల వద్దకు వెళ్లి నమోదు చేసుకోవాలి. డిజిటల్ కార్డులు వస్తే ఇబ్బందులు పడుతామని లబ్ధిదారులు ఆందోళన చెందుతున్నారు.

గోరంట్ల వెంకట్‌నారాయణ, రేషన్ డీలర్ల సంఘం నెక్కొండ మండల అధ్యక్షుడు

ఈ–కేవైసీ నమోదు చేసుకోవాలి



రేషన్‌కార్డులో పేరు ఉన్న ప్రతి ఒక్కరూ ఈ–కేవైసీ నమోదు చేసుకోవాలి. రాష్ట్రంలో ఎక్కడైనా రేషన్ షాపు వద్దకు వెళ్లి లబ్ధిదారులు తమ వేలిముద్రలు లేదా ఐరిస్‌తో ఈ–కేవైసీ చేసుకునే అవకాశం ఉంది. వేలి ముద్రలు పడని వృద్ధులు, చిన్న పిల్లలు ఆధార్ కేంద్రానికి వెళ్లి అప్‌డేట్ చేసుకోవాలి. ఈ–కేవైసీ గడువు ముగిస్తే రేసన్ సరుకులు పొందడం కష్టమవుతుంది.

- రాజ్‌కుమార్, తహసీల్దార్, నెక్కొండ

పార్టీ పటిష్టతపై 'హస్తం' ఫోకస్

- వివాదాలకు కేంద్రమవుతున్న నియోజకవర్గాలపై కాంగ్రెస్ అధిష్టానం దృష్టి
- ముఖ్యంగా పరకాల, వరంగల్ తూర్పుపై పోస్టుమార్టం మరూ
- వరంగల్ పశ్చిమ, వర్ధన్నపేట నియోజకవర్గాలపై కూడా..
- సమన్వయం లేని ముఖ్యనేతల వ్యవహార శైలిపై ఆరా
- స్థానిక సంస్థల ఎన్నికల వేళ పార్టీని గాడిన పెట్టేలా ముందుకు

సాక్షి, వరంగల్: ఉమ్మడి వరంగల్ జిల్లాలో కాంగ్రెస్ పార్టీని చక్కదిద్దేందుకు అధిష్టానం దృష్టి సారించినట్లు తెలుస్తోంది. ముఖ్యంగా వరంగల్ తూర్పు, పరకాల నియోజకవర్గాల్లో అసంతృప్తి జ్వాలలు రగులుతున్నాయి. అందుకు గల కారణాలను లోతుగా పరిశీలించిన కాంగ్రెస్ అధిష్టానం.. స్థానిక సంస్థల ఎన్నికల వేళ పార్టీని క్షేత్రస్థాయిలో మరింత పటిష్టం చేసే దిశగా ముఖ్య నేతల మధ్య ఉన్న విభేదాలను తగ్గించేలా ఆలోచన చేస్తోంది. అదే సమయంలో పార్టీని దెబ్బతీసే విధంగా ఎవరైనా వ్యవహరిస్తే సహించేది లేదనే సంకేతాలను ఇప్పటికే పంపినట్లు చర్చ జరుగుతోంది. గతంలో ఓ నాయకుడి విషయంలో మంత్రి కొండా సురేఖ, పరకాల ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్‌రెడ్డి మధ్య జరిగిన ఆడియో సంభాషణ సామాజిక మాధ్యమాల్లో వైరలైంది. దసరా పండుగ వేళ మంత్రి అనుచరులు ఏర్పాటు చేసిన ఓ ఫ్లెక్సీపై స్థానిక ఎమ్మెల్యే ఫొటో లేదనే విషయమై రచ్చ జరిగిన సంగతి తెలిసిందే. గతంలో ఇదే నియోజకవర్గం నుంచి కొండా సురేఖ ఎమ్మెల్యేగా ఉండడంతో ఆమె అనుచరులు, ప్రస్తుత ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్‌రెడ్డి వర్గీయుల మధ్య జరుగుతున్న గ్రూప్ వార్‌తోనే పార్టీకి నష్టం వస్తుందని అంచనాకు వచ్చిన అధిష్టానం.. ఈ విషయమై లోతుగా చర్చించేందుకు ఓ ముఖ్య నేతకు కీలక బాధ్యతలు అప్పగించిన విషయం తెలిసిందే. అంతర్గతంగా ముఖ్య నేతలతో సదరు నేత మాట్లాడినట్లు సమాచారం.

వరంగల్ తూర్పుపైనా..

మంత్రి కొండా సురేఖ ఎమ్మెల్యేగా ప్రాతినిధ్యం వహిస్తున్న వరంగల్ తూర్పు నియోజకవర్గంలోనూ రాజకీయ పరిస్థితిపై పార్టీ పెద్దలు ఆరా తీస్తున్నట్లు తెలిసింది. ఎమ్మెల్సీ బస్వరాజు సారయ్య, బల్దియా మేయర్ గుండు సుధారాణి, కాంగ్రెస్ జిల్లా అధ్యక్షురాలు ఎర్రబెల్లి స్వర్ణ, ఇలా ముఖ్య నేతలు ఈ నియోజకవర్గంలో ఉండడంతో వర్గపోరు జరుగుతున్నట్లు అధిష్టానం దృష్టికి వెళ్లింది. గత అసెంబ్లీ ఎన్నికలకు ముందు బీఆర్‌ఎస్ నుంచి కాంగ్రెస్‌లో చేరిన ఓనేతకు మంత్రి కొండా సురేఖ ప్రాధాన్యం ఇస్తుండడంతో ఏళ్లుగా పార్టీని అంటిపెట్టుకుని ఉన్న వారు దూరంగా ఉంటున్నారని చర్చ నడుస్తోంది. ఇతర ముఖ్య నాయకుల కార్యకర్తలను కూడా పట్టించుకునే పరిస్థితి లేకపోవడంతో రెండు వర్గాలుగా పార్టీ చీలిపోయిందనే విషయంపై అధిష్టానం లోతుగా అధ్యయనం చేస్తున్నట్లు సమాచారం. వచ్చే మున్సిపల్ ఎన్నికల్లో కాంగ్రెస్ గెలవాలంటే ముఖ్యులందరూ సమన్వయంతో వ్యవహరిస్తేనే సాధ్యమని నిర్ణయానికి వచ్చిన అధిష్టానం పెద్దలు లోపం ఎక్కడ ఉంది.. ఎవరి వల్ల పార్టీకి నష్టం కలుగుతున్నదనే విషయాలపై దృష్టి సారించినట్లు తెలిసింది. వర్ధన్నపేట, వరంగల్ పశ్చిమ నియోజకవర్గాల్లో నాయకులను ఏకతాటిపైకి తీసుకొచ్చే దిశగా ఆ పార్టీ అంతర్గత విచారణ ఇప్పటికే మొదలెట్టింది. త్వరలోనే కీలక నిర్ణయాలు తీసుకొని ముందుకెళ్లే అవకాశముందని పార్టీ శ్రేణులంటున్నాయి.

పాకాల అభివృద్ధికి కృషి



అధికారులతో చర్చిస్తున్న ఎమ్మెల్యే మాధవరెడ్డి

ఖానాపురం: పాకాలను జాతీయ, అంతర్జాతీయ పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దడానికి కృషి చేస్తున్నట్లు నర్సంపేట ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి అన్నారు. పాకాలలో అభివృద్ధి పనులు చేపట్టడానికి డీపీఆర్‌ల కోసం ప్రైవేట్ ఏజెన్సీతో కలిసి ఆదివారం ఆయన పర్యటించారు. ఈ సందర్భంగా పార్కు వ్యూ పాయింట్, జంతు ప్రదర్శనశాల, కొత్తగూడ మండలం గుండం శివాలయం వద్ద శివాలయ అభివృద్ధి పనులపై చర్చించారు. తూము ద్వారా లీకేజీ అయిన కాల్వ ద్వారా వెళ్తున్న నీటిలోకి దిగి ఏజెన్సీ బాధ్యులతో మాట్లాడారు. దేశంలోనే అత్యంత ప్రకృతి సిద్ధమైన టూరిజం పార్కుగా పాకాల నిలుస్తుందన్నారు. వరంగల్, నర్సంపేట, మహబూబాబాద్‌కు అతి సమీపంలోనే ఉందన్నారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ పాలాయి శ్రీనివాస్, వైస్ చైర్మన్ శాఖమూరి హరిబాబు, ప్రజాప్రతినిధులు, పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

పోలీస్ అమరుల త్యాగాలను స్మరించుకుందాం

- నేటి నుంచి 31 వరకు కార్యక్రమాలు
- రక్తదానానికి యువత ముందుకు రావాలి
- వరంగల్ పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝా



వరంగల్ క్రైం: శాంతి భద్రతల పరిరక్షణలో ప్రాణత్యాగం చేసిన పోలీస్ అమరులను స్మరించుకుందామని వరంగల్ పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝా ప్రజలకు పిలుపునిచ్చారు. పోలీస్ అమరుల సంస్మరణ సందర్భంగా ఈనెల 21 నుంచి 31వ తేదీ వరకు వివిధ కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. మొదటి రోజు పోలీస్ ఫ్లాగ్ డేను పురస్కరించుకొని కమిషనరేట్ కార్యాలయంలోని పోలీస్ అమరుల స్తూపం వద్ద శ్రద్ధాంజలి ఘటించడంతో పాటు శోక్ శ్రస్త్ పరేడ్, అనంతరం కమిషనరేట్ నుంచి అశోక జంక్షన్ వరకు పోలీస్ కవాతు ఉంటుందని పేర్కొన్నారు.

నేటి నుంచి రక్తదాన శిబిరాలు

కమిషనరేట్ పరిధిలో సోమవారం నుంచి రక్తదాన శిబిరాలు ఏర్పాటు చేస్తున్నట్లు సీపీ తెలిపారు. 21న హనుమకొండ, 22న కాజీపేట, 23న వరంగల్, 24న మామునూర్, 25న పోలీస్ కమిషనరేట్ కార్యాలయం, 26న వర్ధన్నపేట, 27న స్టేషన్‌ఘన్‌పూర్, 28న నర్సంపేట, 29న పరకాల, నర్సంపేట డివిజన్ల పరిధిలో ఎంజీఎం రెడ్ క్రాస్ ఆధ్వర్యంలో రక్తదాన శిబిరాలు ఉంటాయన్నారు.

వ్యాసరచన పోటీలు

8వ తరగతి నుంచి ఇంటర్ చదువుతున్న విద్యార్థులకు 'విచక్షణతో కూడిన సెల్ వినియోగం, డిగ్రీ ఆపై చదువులు చదువుచున్న యువతీ యువకులకు 'తెలంగాణను డ్రగ్స్ రహిత రాష్ట్రంగా తీర్చిదిద్దడంలో నా పాత్ర' అనే అంశాలపై తెలుగు, ఇంగ్లిష్, ఉర్దూ భాషల్లో వ్యాసరచన పోటీలను నిర్వహిస్తున్నామని తెలిపారు. ఆన్‌లైన్‌లో ఈనెల 27 వరకు రాసి పంపిన మూడు వ్యాసాలకు ఒక్కో భాషకు జిల్లాల వారీగా బహుమతులు అందజేయనున్నట్లు వివరించారు.

ఫొటో గ్రాఫర్లకు పోటీలు

ఔత్సాహిక ఫొటో, వీడియోగ్రాఫర్లకు.. పోలీసుల త్యాగాలు, పోలీసు విధుల్లో ప్రతిభను తెలిపే విధంగా ఉండే ఇటీవల తీసిన 3 ఫొటోలు, తక్కువ నిడివి(3 నిమిషాలు) గల షార్ట్ ఫిల్మ్స్ తీసి రాష్ట్ర స్థాయి పోటీల కోసం ఈనెల 22లోపు షార్ట్ ఫిల్మ్ లోడ్ చేసిన పెన్ డ్రైవ్, 10x8 సైజ్ ఫొటోలను కమిషనరేట్ పీఆర్వోకు అందజేయాలని సూచించారు. ముఖ్యంగా మూఢనమ్మకాలు, ఇతర సామాజిక రుగ్మతలు, అత్యవసర సమయాల్లో పోలీసుల స్పందన, ప్రకృతి వైపరీత్యాల్లో పోలీసుల సేవ, సైబర్ నేరాలు, ఈవ్‌టీజింగ్, ర్యాగింగ్, మత్తు పదార్థాల సేవనం, వాటి అనర్థాలు, ఇతర సందర్భాల్లో పోలీసుల కీర్తి ప్రతిష్టలను పెంపొందించే అంశాలకు సంబంధించి 2023 అక్టోబర్ నుంచి ఇప్పటి వరకు తీసిన మూడు ఫొటోలు, షార్ట్ ఫిల్మ్ మాత్రమే పంపించాలని పేర్కొన్నారు. పోలీసుల పనితీరుతో పాటు పోలీసులు వినియోగించే ఆయుధాలపై విద్యార్థులకు అవగాహన కల్పించడానికి ఆన్‌లైన్ ద్వారా పోలీస్ ఓపెన్ హౌస్‌లు ఏర్పాటు చేశామన్నారు.

వీసీకి సవాళ్లెన్నో..!

- సమస్యలతో కేయూ సతమతం
- వేధిస్తున్న అధ్యాపకుల కొరత
- వర్సిటీ పాలన గాడిన పడేనా?



కేయూ నూతన వీసీ ప్రతాప్‌రెడ్డి

కేయూ క్యాంపస్: కాకతీయ యూనివర్సిటీ కొన్నేళ్లుగా సమస్యలతో సతమతమవుతోంది. ప్రధానంగా రెగ్యులర్ అధ్యాపకుల కొరత వేధిస్తోంది. గత వీసీ రమేశ్ బాధ్యతలు నిర్వర్తించిన మూడేళ్లపాటు ఎన్నో సమస్యలు తలెత్తాయి. తరచూ ఆందోళనలు జరిగిన విషయం తెలిసిందే. చివరికి వీసీ రమేశ్‌పై విజిలెన్స్ విచారణ సాగే వరకు పరిస్థితి వెళ్లింది. అనంతరం ఇన్‌చార్జ్ వీసీగా వాకాటి కరుణ ఒక్కసారి మాత్రమే కేయూకు వచ్చి ఆ తర్వాత మళ్లీ వర్సిటీ ముఖం చూడలేదు. తన పరిధిలో ఇన్‌చార్జ్ వీసీగా ఆమె కొన్ని సమస్యలను పరిష్కరించారు. చాలా వరకు అలాగే మిగిలిపోయాయి. రెగ్యులర్ వీసీగా ఉస్మానియా వర్సిటీ జువాలజీ విభాగం రిటైర్డ్ ప్రొఫెసర్ కె.ప్రతాప్‌రెడ్డి ఈనెల 19న బాధ్యతలు స్వీకరించారు. ఆయనకు వర్సిటీలోని అనేక సమస్యలు, సవాళ్లు స్వాగతం పలుకుతున్నాయి.

నాణ్యమైన పరిశోధనలు అవసరం..

కేయూలో కొన్నేళ్లుగా కొన్ని విభాగాల్లో తరగతుల నిర్వహణ సరిగ్గా జరగడం లేదు. సరిపడా రెగ్యులర్ అధ్యాపకులు లేకపోవడంతో కాంట్రాక్టు, పార్ట్‌టైం అధ్యాపకులతో విద్యాబోధన సాగుతోంది. పరిశోధనలు సమాజానికి ఉపయోగపడేలా ప్రోత్సహించాల్సిన అవసరం ఉంది. సైన్స్, ఇంజనీరింగ్, ఫార్మసీ వంటి కోర్సుల్లో ల్యాబ్ ఎక్విమెంట్స్ కూడా ముఖ్యం. కొందరు ప్రొఫెసర్లు పరిపాలనా పదవులపైనే ఎక్కువగా దృష్టి సారించడంతో విద్యార్థులపై తీవ్ర ప్రభావం పడుతోంది.

సమస్యలు కోకొల్లలు..

- వర్సిటీలో అడ్మిషన్ పొందిన వారికి హాస్టల్ వసతి సరిగా లేదు.
- న్యూ పీజీ బాయ్స్ హాస్టల్ వద్ద రూ.2.50 కోట్ల వ్యయంతో డైనింగ్ హాల్ నిర్మించినప్పటికీ అందుబాటులోకి తేలేదు. మరో రూ.20 కోట్ల వ్యయంతో చేపట్టిన విద్యార్థినుల వసతి గృహం ప్రారంభించినప్పటికీ పనులు మధ్యలోనే నిలిపేశారు.
- అధ్యాపకుల పదోన్నతుల కల్పనలో జాప్యం జరుగుతోంది.
- బ్యాక్‌లాగ్ పోస్టుల్లో చేరిన నలుగురు అసిస్టెంట్ ప్రొఫెసర్లు పదోన్నతి కోసం నిరీక్షిస్తున్నారు.
- గతంలో పదోన్నతులు పొందిన వారికి ఎరియర్స్ చెల్లింపులో జాప్యం జరుగుతోంది.
- వివిధ విభాగాల్లో 2010లో నియమితులైన అసిస్టెంట్ ప్రొఫెసర్లకు ఇప్పటి వరకు పదోన్నతులు కల్పించలేదు.
- బోధనేతర ఉద్యోగులకు రెండు డిప్యూటీ రిజిస్ట్రార్ పోస్టుల్లో పదోన్నతి కల్పించాల్సి ఉంది. నాన్‌టీచింగ్ వివిధ కేడర్లలో పదోన్నతులు కల్పించాల్సి ఉంది.
- నాలుగో తరగతి పోస్టులు 150 భర్తీ చేయాల్సి ఉంది.
- ఉద్యోగ విరమణ పొందిన ఉద్యోగులకు చెల్లించాల్సిన బకాయిలు రూ.కోట్లలో పెండింగ్‌లో ఉన్నాయి.
- 507 మంది కాంట్రాక్టు, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులకు నిధుల కొరతతో ప్రతినెలా వేతనాల చెల్లింపు ఆలస్యమవుతోంది.
- 1992 నుంచి నియామకాలు లేవు. దీంతో రెగ్యులర్ బోధనేతర ఉద్యోగుల కొరత తీవ్రంగా ఉంది.
- నూతన స్కిల్, టెక్నికల్, ల్యాబ్, బిల్డింగ్ వర్క్స్ చేయగల సిబ్బంది అవసరం.
- క్యాంపస్‌లోని శానిటేషన్ క్లీన్ అండ్ గ్రీన్ మెయింటెనెన్స్‌కు ప్రత్యేక స్టాఫ్‌ను నియమించాలి.
- పార్ట్‌టైం లెక్చరర్లను కాంట్రాక్టు లెక్చరర్లుగా నియమించాలనే డిమాండ్ ఉంది.
- యూనివర్సిటీ కాలేజీల్లోనూ అధ్యాపకుల కొరత వేధిస్తోంది. పీహెచ్‌డీ పూర్తి చేసిన వారు తమను పార్ట్‌టైం లెక్చరర్లుగా నియమించాలని డిమాండ్ చేస్తున్నారు.
- కేయూ దూరవిద్య కేంద్రాన్ని పటిష్టపరిస్తే అడ్మిషన్లు పెరుగుతాయి. ఆన్‌లైన్ కోర్సులపై దృష్టిసారిస్తే ఆదాయం పెరుగుతుంది.
- యూనివర్సిటీ భూములు ఇప్పటికే పలుచోట్ల అన్యాక్రాంతం అయ్యాయి. రూ.10 కోట్ల వ్యయంతో ఏడు నెలల క్రితం ప్రారంభించిన కేయూ ప్రహరీ నిర్మాణం ఆదిలోనే ఆగిపోయింది.
- కాకతీయ యూనివర్సిటీలో రూ.4.50 కోట్ల వ్యయంతో నిర్మించిన కే హబ్ భవనంలో ఎక్విప్‌మెంట్స్ ఏర్పాటు చేసి వినియోగంలోకి తేవాలి.
- పీవీ నాలెడ్జ్ సెంటర్ ఏర్పాటు చేయలేదు.
- రూసా ప్రాజెక్టు కింద రూ 45–50 కోట్లు నిధులు మంజూరైనా వినియోగించడం లేదు.



అలంకారప్రాయంగా కే హబ్




నిరుపయోగంగా కేయూ అడ్మిషన్ల డైరెక్టరేట్ భవనం (పీవీ నాలెడ్జ్ సెంటర్)

సిబ్బంది వివరాలు..

రెగ్యులర్ అధ్యాపకులు :	81
కాంట్రాక్టు లెక్చరర్లు :	180
పార్ట్‌టైం లెక్చరర్లు :	180
నాన్‌టీచింగ్ రెగ్యులర్ ఉద్యోగులు :	354
కాంట్రాక్టు, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులు :	507
పెన్షనర్లు:	750 నుంచి 800 మంది

రైతులను మోసం చేసిన ప్రభుత్వం



నర్సంపేట పట్టణంలోని తెలంగాణ తల్లి విగ్రహం వద్ద నిరసన తెలుపుతున్న బీఆర్‌ఎస్ నాయకులు

నర్సంపేట: రాష్ట్ర ప్రభుత్వం రైతు భరోసాను నిలిపివేసి రైతులను మోసం చేసిందని బీఆర్‌ఎస్ జిల్లా నాయకుడు నల్లా మనోహర్‌రెడ్డి అన్నారు. ఈ మేరకు పట్టణంలోని తెలంగాణ తల్లి విగ్రహం వద్ద ఆదివారం బీఆర్‌ఎస్ పట్టణ అధ్యక్షుడు నాగెల్లి వెంకటనారాయణగౌడ్ ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా మనోహర్‌రెడ్డి మాట్లాడుతూ ఈ సీజన్‌లో రైతు భరోసా ఇవ్వలేమని స్వయంగా వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు పేర్కొనడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. అన్ని విధాలుగా ఏడిపిస్తున్న కాంగ్రెస్‌కు రైతులను ఉసురు తప్పదన్నారు. రైతు భరోసాకు డబ్బులు లేకపోవడంతోనే సబ్ కమిటీలు అంటూ డ్రామాలు ఆడుతున్నారని పేర్కొన్నారు. కార్యక్రమంలో బీఆర్‌టీయూ జిల్లా అధ్యక్షుడు గోనె యువరాజు, బీఆర్‌ఎస్ పట్టణ కార్యదర్శి వెన్నముద్దల శ్రీధర్‌రెడ్డి, కౌన్సిలర్లు నాగిశెట్టి పద్మ ప్రసాద్, గందె రజితచంద్రమౌళి, పెరుమాండ్ల ప్రభాకర్‌రెడ్డి, పెండెం వెంకటేశ్వర్లు, పుట్టపాక కుమారస్వామి, మేడిద శ్రీనివాస్, రాయరాకుల సారంగం, పెండ్యాల యాదగిరి, సీనియర్ నాయకులు అప్పాల సుదర్శన్, తోట సుదర్శన్, బీరం నాగిరెడ్డి, నాయిని వేణు, పెరుమాండ్ల రవి, సంపంగి సాలయ్య తదితరులు పాల్గొన్నారు.

రేషన్ బియ్యం పట్టివేత

సంగెం: గీసుకొండ మండల కేంద్రంలోని సంతోషి మాత పౌల్ట్రీఫాంలో రేషన్ బియ్యం పట్టుకున్నట్లు టాస్క్‌ఫోర్స్ ఏసీపీ మధుసూదన్ తెలిపారు. చిట్టి రెడ్డి జీవన్‌రెడ్డి పౌల్ట్రీఫాంలో రేషన్ బియ్యాన్ని నిల్వ చేసి దాణాగా వాడుతున్నట్లు సమాచారం రావడంతో గీసుకొండ పోలీసులతో కలిసి ఆదివారం దాడులు చేసినట్లు పేర్కొన్నారు. ఇందులో రూ.37,500 విలువైన 15 క్వింటాళ్ల రేషన్ బియ్యం స్వాధీనం చేసుకున్నట్లు ఏసీపీ మధు సూదన్ తెలిపారు.

రెడ్డిపాలెంలో..

గీసుకొండ మండలంలోని రెడ్డిపాలెం గ్రామంలో బాసాని శౌరెడ్డికి చెందిన పందుల ఫాంలో 25 వేల రూపాయల విలువైన రేషన్ బియ్యాన్ని స్వాధీనం చేసుకున్నట్లు టాస్క్‌ఫోర్స్ ఏసీపీ మధుసూదన్ తెలిపారు. నిందితులు చిట్టిరెడ్డి జీవన్‌రెడ్డి, బాసాని శౌరెడ్డి, బియ్యాన్ని గీసుకొండ పోలీసులకు అప్పగించినట్లు ఆయన పేర్కొన్నారు. దాడుల్లో టాస్క్‌ఫోర్స్ ఇన్‌స్పెక్టర్ రంజిత్‌కుమార్, ఎస్సై వి.దిలీప్ పాల్గొన్నారు.

క్లుప్తంగా

ముగిసిన సాఫ్ట్‌బాల్‌ టోర్నమెంట్‌



నిజామాబాద్‌ జట్టుకు ట్రోఫీ అందజేస్తున్న అతిథులు

వరంగల్‌: వరంగల్‌ నగరం 14వ డివిజన్‌ పరిధి ఇన్‌ఫాంట్‌ జీసస్‌ ఉన్నత పాఠశాలలో రెండు రోజులుగా జరుగుతున్న 8వ తెలంగాణ సబ్‌ జూనియర్స్‌ ఇంటర్‌ డిస్ట్రిక్ట్‌ సాఫ్ట్‌బాల్‌ టోర్నమెంట్‌ ఆదివారం ముగిసింది. విజేతగా నిజామాబాద్‌, రన్నరప్‌గా మహబూబ్‌నగర్‌, మూడో స్థానంలో మెదక్‌ జిల్లా జట్టు నిలవగా.. ముఖ్య అతిథులు ఏనుమాముల ఇన్‌స్పెక్టర్‌ అల్లే రాఘవేందర్‌, సీఐ కంప రవీందర్‌ బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో అసోసియేషన్‌ జిల్లా అధ్యక్షుడు వీరగోని రాజ్‌కుమార్‌, కార్యదర్శి పూజారి అశోక్‌బాబు, పాఠశాల హెచ్‌ఎం మరియమ్మ మథూర్‌, డీవైఎస్‌ఓ సత్యవాణి తదితరులు పాల్గొన్నారు.

‘మహా’లో ఎన్నికల కోడ్‌.. ఇక్కడ మీటింగ్‌!



కాళేశ్వరం: మహదేవపూర్‌ మండలం కాళేశ్వరం దేవస్థానం వసతిగృహంలో మహారాష్ట్రలోని గడ్చిరోలి జిల్లా అహేరీ ఎమ్మెల్యే అభ్యర్థి భాగ్యశ్రీఆత్రం సీఐటీయూ ఆధ్వర్యంలో ఆదివారం మహిళా కార్మికులతో సమావేశం నిర్వహించారు. కాగా, మహారాష్ట్రలో ఎన్నికల కోడ్‌ అమలులో ఉన్న నేపథ్యంలో సుమారు ఐదు వందల మందితో ఆమె కార్మికుల సమస్యలపై సమావేశం నిర్వహించడం కాళేశ్వరంలో చర్చనీయాంశంగా మారింది. ఆమె ప్రస్తుతం అహేరీ ఎన్‌సీపీ ఎమ్మెల్యే, మంత్రి ధర్మారావు బాబా ఆత్రం కుమార్తె. కాగా, వారిద్దరు ప్రత్యర్థులుగా నవంబర్‌ 20న జరిగే అసెంబ్లీ ఎన్నికల్లో పోటీలో ఉండనున్నారు. ఆమెకు కాంగ్రెస్‌ పార్టీ నుంచి బీఫాం వచ్చే అవకాశం ఉంది.

గుర్తుతెలియని వాహనం ఢీకొని మహిళ మృతి

పరకాల : గుర్తుతెలియని వాహనం ఢీకొని మహిళ (వలస కూలీ) మృతి చెందిన సంఘటన పరకాల శివారులో ఆదివారం చోటుచేసుకుంది. సీఐ క్రాంతికుమార్‌ తెలిపిన వివరాల ప్రకారం.. మహారాష్ట్ర నాందేడ్‌ జిల్లా బెల్కోని గ్రామానికి చెందిన షేక్‌ షాహీన(48) , అబ్దుల్‌ దంపతులు 20 రోజుల క్రితం హనుమాన్‌ కాటన్‌ మిల్లులో పనిలో చేరారు. ప్రధాన రహదారి పక్కనే ఉన్న కాటన్‌మిల్లు యాజమాన్యం షెడ్లు నిర్మాణం చేసి వారికి వసతి కల్పించింది. అయితే ఆదివారం ఉదయం షేక్‌ షాహీన్‌ ముఖం కడుగుతున్న క్రమంలో వేగంగా దూసుకొచ్చిన గుర్తుతెలియని కారు ఢీకొని వెళ్లిపోయింది. తలకు బలమైన గాయమై ఆమె అక్కడికక్కడే ప్రాణం కోల్పోయింది. ఈ ఘటనతో మృతురాలి కుటుంబం, మిల్లు కార్మికులు కన్నీటి పర్యంతమయ్యారు. మృతురాలి భర్త అబ్దుల్‌ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి మృతదేహానికి పరకాలలో పోస్టుమార్టం నిర్వహించి కుటుంబ సభ్యులకు అప్పగించినట్లు సీఐ తెలిపారు.

అమరుల త్యాగనిరతికి జోహార్లు

శాంతిభద్రతల పరిరక్షణలో పోలీసులే కీలకం

- విధి నిర్వహణలో అమరులైన వారు ఎందరో..
- దేశవ్యాప్తంగా ఈఏడాది 214 మంది వీర మరణం
- నేడు జాతీయ పోలీసు అమరవీరుల సంస్మరణ దినోత్సవం

మామునూరు: పోలీసుల ఉద్యోగం.. మిగతా ప్రభుత్వ శాఖల మాదిరికాదు. కానిస్టేబుల్‌ నుంచి.. ఆ శాఖలో అత్యున్నత అధికారి వరకు నిత్యం అప్రమత్తంగా ఉంటూ శాంతిభద్రతల పరిరక్షణే ధ్యేయంగా విధులు నిర్వర్తిస్తుంటారు. కొన్ని సందర్భాల్లో అసాంఘిక శక్తులతో ప్రాణాలకు తెగించి పోరాడాల్సి వస్తోంది. అలాంటి సందర్భాలో వెన్ను చూపక వీరోచితంగా ముందుకెళ్తారు. రేయి, పగలు అనే తేడా లేకుండా పండుగలు, సరదాలను పక్కన పెట్టి విధి నిర్వహణలో పాల్గొంటారు. ప్రజల కోసం చిత్త శుద్ధితో పనిచేయడమే వారికి సంతృప్తి. నేడు జాతీయ పోలీసుల అమరవీరుల సంస్మరణ దినోత్సవం సందర్భంగా వారి త్యాగాలను గుర్తుచేసుకుంటూ జోహార్లు పలుకుదాం.

ప్రజల రక్షించేది పోలీసులే..

ఇంటి నుంచి.. ప్రభుత్వ కార్యాలయాల వరకు.. గ్రామ, నగరాల నుంచి దేశ సరిహద్దుల వరకు, అందరికీ, అన్ని చోట్లా రక్షణ కల్పించే బృహత్తర బాధ్యత పోలీసులది. భావోద్వేగాలు, రాగద్వేషాలను పక్కన పెట్టి విధులు నిర్వర్తిస్తారు. యూనిఫామ్‌ ధరించి దేశభద్రతతో పాటు సమాజ బాధ్యతను తమ భుజ స్కంధాలపై వేసుకుని ప్రాణాలను సైతం పణంగా పెడతారు. 1989 అక్టోబర్‌ 21న భారత్‌–చైనా సరిహద్దు ప్రాంతంలో శుత్రుమూకల చేతుల్లో కేంద్ర రిజర్వ్‌ పోలీసులు నేలకొరిగారు. వారి త్యాగాలను స్మరించుకుంటూ ఏటా అక్టోబర్‌ 21న పోలీసుల అమర వీరుల సంస్మరణ దినోత్సవాన్ని ఘనంగా జరుపుకుంటారు.



పీటీసీలో ముస్తాబైన పోలీసు అమరవీరుల స్తూపం

దేశంలో 214 మంది అసువులు..

ఈఏడాది దేశ వ్యాప్తంగా 214 మంది అమరులయ్యారు. విధులు నిర్వర్తిస్తూ అమరలైన మొత్తం 214 మంది పోలీసుల త్యాగాలను గుర్తుచేసుకుంటూ మామునూరు టీఎస్‌ఎస్పీ నాలుగు, ఐదు బెటాలియన్‌, పోలీస్‌ శిక్షణ కళాశాలలో సోమవారం వేర్వేరుగా పోలీసు అమర వీరుల సంస్మరణ సభ జరుగనుంది.

నేడు అమరవీరుల దినోత్సవం

అమరవీరుల సంస్మరణ దినోత్సవ కోసం ఖిలా వరంగల్‌ మండలం మామునూరు పోలీస్‌ శిక్షణ కళాశాల, టీఎస్‌ఎస్పీ నాలుగో పోలీస్‌ పరేడ్‌ మైదానం ముస్తాబైంది. మామునూరు టీఎస్‌ఎస్పీ నాలుగు బెటాలియన్‌, పీటీసీ ప్రాంగణంలో వేర్వేరుగా జరిగే పోలీసు వారోత్సవాలకు ఏర్పాట్లు పూర్తయ్యాయి. అమర వీరుల స్తూపాలను శుద్ధిచేసి పూలతో అలంకరించారు. విద్యుత్‌ దీపాలు, సీరీస్‌ బల్బ్‌లు ఏర్పాటు చేయగా స్తూపం విద్యుత్‌ కాంతులతో వెలిగిపోతోంది. సోమవారం ఉదయం పోలీస్‌ అధికారులతో కమాండెంట్‌ శివప్రసాద్‌రెడ్డి, పీటీసీ ప్రిన్సిపాల్‌ ఇంజారపు పూజ వేర్వేరుగా స్పెషల్‌ పోలీసులు పరేడ్‌ గ్రౌండ్‌కు చేరుకుంటారు. దేశం కోసం ప్రాణాలు అర్పించిన అమరవీరులను మననం చేసుకుని, వారి ఆత్మశాంతి చేకూర్చే విధంగా అమరవీరుల స్తూపాలపై పుష్పగుచ్ఛాలు ఉంచి ఉదయం 8.40గంటలకు ఘనంగా నివాళులర్పించనున్నారు. ఆతర్వాత అమరవీరుల కుటుంబాలకు మెమోంటోలు అందజేసి శాలువాలతో సన్మానించనున్నారు. అమరవీరుల కుటుంబాలకు అండదండగా పోలీసుశాఖ ఉంటుందని భరోసా కల్పించనున్నారు.



పోలీస్‌ అమరవీరులకు నివాళులర్పిస్తున్న ప్రిన్సిపాల్‌ ఇంజారపు పూజ (ఫైల్‌)

భాషోపాధ్యాయుల పాత్ర కీలకం

- రాష్ట్ర మంత్రి ధనసరి సీతక్క

విద్యారణ్యపురి: సమాజ నిర్మాణంలో భాషోపాధ్యాయుల పాత్ర కీలకమని రాష్ట్ర పంచాయతీరాజ్‌ శాఖమంత్రి సీతక్క అన్నారు. ఆదివారం రాష్ట్ర భాషోపాధ్యాయ సంస్థ ఆధ్వర్యంలో హనుమకొండలోని టీటీడీ కల్యాణ మండపంలో ఆ సంస్థ జిల్లా అధ్యక్షుడు పోలోజు శ్రీహరి అధ్యక్షతన భాషోపాధ్యాయులకు ఇటీవల పదోన్నతులు కల్పించిన నేపథ్యంలో ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలుపుతూ సభ నిర్వహించారు. ఈ సభలో మంత్రి సీతక్క ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర సాధనలో ఉపాధ్యాయుల పాత్ర కీలకమని, అందులో భాషోపాధ్యాయుల పాత్ర కూడా ఎంతో ఉందన్నారు. రాష్ట్ర సాధనలో పాటలు, సాహిత్యం ద్వారా ఎంతో చైతన్యం కలిగించారన్నారు. భాషను బతికించుకోవడం, పాఠశాలల పరిరక్షణ, విద్యార్థులను తీర్చిదిద్దడంలో గురుతర బాధ్యత ఉపాధ్యాయులదేనన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి సారథ్యంలోని ప్రజాప్రభుత్వం విద్యారంగ సమస్యల పరిష్కారానికి కృషిచేస్తుందన్నారు. ఉపాధ్యాయులు సహాయసహకారాలు ప్రభుత్వానికి అవసరమన్నారు. వరంగల్‌ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి మాట్లాడుతూ ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం చిత్తశుద్ధితో కృషి చేస్తుందన్నారు. సభలో ఎస్‌ఎల్‌టీఏ రాష్ట్ర అధ్యక్షుడు చక్రవర్తుల శ్రీనివాస్‌, కార్యదర్శి కె. గౌరిశంకర్‌, రాష్ట్ర అసోసియేట్‌ అధ్యక్షుడు షేక్‌హాజి నూరానీ, బాధ్యులు పెండ్యాల బ్రహ్మయ్య, హర్షవర్ధన్‌రెడ్డి, ఎస్‌వీ సుబ్బారావు, డాక్టర్‌ అడ్లూరి వెంకటేశ్వర్‌రావు, మర్రిపెల్లి రమేశ్‌, కానుగల భద్రయ్య, గుండు రవి, కక్కెర్ల దయాకర్‌, ప్రవీణ్‌,ఎస్‌వీవీ ప్రసాద్‌, అమర్‌, హమీద్‌, కృష్ణమూర్తి, శ్రీనివాసచారి ,కుమారస్వామి, పద్మావతి, రామలింగయ్య తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న మంత్రి సీతక్క

ఉమ్మడి జిల్లాలో సీసీఐ కొనుగోలు కేంద్రాలు

- ప్రారంభించనున్న మంత్రి కొండా సురేఖ

వరంగల్‌: కాటన్‌ కార్పొరేషన్‌ ఆఫ్‌ ఇండియా (సీసీఐ) ఉమ్మడి జిల్లాలో పత్తి కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేస్తోంది. సీసీఐ అధికారులు ఉమ్మడి వరంగల్‌ జిల్లాలో ఉన్న మార్కెట్‌ కమిటీని ఒక్కో పత్తి కొనుగోలు సెంటర్‌గా గుర్తించారు. సీసీఐ గుర్తింపు పొందిన జిన్నింగ్‌ మిల్లుల్లో పత్తిని కొనుగోలు చేయనున్నారు. సీసీఐ నిర్వహించిన టెండర్లలో ఉమ్మడి జిల్లాలోని 59 జిన్నింగ్‌ మిల్లులు పాల్గొనగా మొదటి దశలో 42 మిల్లుల్లో పత్తి కొనుగోళ్లు చేసేందుకు నోటిఫై చేశారు. ఏనుమాముల వరంగల్‌ వ్యవసాయ మార్కెట్‌లో సోమవారం రాష్ట్ర అటవీ, దేవాదాయ, పర్యావరణ శాఖ మంత్రి కొండా సురేఖ సీసీఐ కొనుగోళ్లను లాంఛనంగా ప్రారంభించనున్నారు. వరంగల్‌ జిల్లాలోని 14 జిన్నింగ్‌ మిల్లులు, హనుమకొండ జిల్లాలోని 4 జిన్నింగ్‌ మిల్లులు, జనగామ జిల్లాలోని 10 జిన్నింగ్‌ మిల్లుల్లో కొనుగోళ్లకు అనుమతి ఇస్తూ ఆయా జిల్లాల కలెక్టర్లు ఉత్తర్వులు జారీ చేశారు.

తేమతోనే చిక్కు..

ప్రస్తుతం మార్కెట్‌కు వస్తున్న పత్తిలో తేమ శాతం ఎక్కువ ఉన్నందున వ్యాపారులు మద్దతు ధర చెల్లించేందుకు ముందుకు రావడం లేదని తెలుస్తోంది. ప్రస్తుతం అకాల వర్షాలు పడుతున్నందున పత్తి తడిసిపోతోంది. ఆరబెట్టేందుకు వీలుకాకపోవడంతో తడి పత్తిని రైతులు మార్కెట్‌కు తీసుకొస్తున్నారని వ్యాపారులు పేర్కొంటున్నారు. ఎక్కువ తేమ ఉన్నందున ధరలు తక్కువగా చెల్లిస్తున్నామని అంటున్నారు. తేమ లేకున్నా వ్యాపారులు కావాలనే తక్కువ ధర చెల్లిస్తున్నారని రైతులు ఆరోపిస్తున్నారు. సీసీఐ కొనుగోలు కేంద్రాలను ప్రారంభిస్తే ఎంఎస్‌పీ క్వింటాలుకు రూ.7,521 లభించాలంటే ఈమేరకు పత్తిలో నాణ్యత ప్రమాణాలు ఉండాలని అంటున్నారు. 8–12 శాతాని కంటే ఎక్కువ తేమ ఉంటే పత్తి కిలో కూడా ఖరీదు చేయదని తెలిసింది. ఈనేపథ్యంలో మద్దతు ధర లభించాలంటే పొడి పత్తి తీసుకువస్తేనే సాధ్యమని వ్యాపారులు తెలిపారు. సోమవారం సీసీఐ కేంద్రాలను ప్రారంభించినా కొనుగోళ్లు ప్రారంభించేందుకు ఇంకా కొన్ని రోజులు పడుతుందని అధికారులు, వ్యాపారులు తెలిపారు.

పద్మశాలీలకు అండగా ఉండాలి

- పద్మశాలి ఉద్యోగుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ఈగ వెంకటేశ్వర్లు

హన్మకొండ: రాజకీయాల్లో రాణిస్తున్న పద్మశాలీలకు అండగా నిలవాలని పద్మశాలి ఉద్యోగుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ఈగ వెంకటేశ్వర్లు అన్నారు. హనుమకొండలోని జెడ్పీ సమావేశం మందిరంలో ఆదివారం ఏర్పాటు చేసిన సంఘం పూర్వ వరంగల్‌ జిల్లా స్థాయి సమావేశంలో పదోన్నతి పొందిన ఉద్యోగులు, పదవీ విరమణ చేసిన ఉద్యోగులను సన్మానించారు. అనంతరం వెంకటేశ్వర్లు మాట్లాడుతూ.. పేద పద్మశాలీ విద్యార్థులకు సంఘం అండగా ఉంటుందని, ఆపదలో ఉన్న వారి వివరాలు పంపిస్తే ఆదుకుంటామన్నారు. సంఘం ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు గుండు ప్రభాకర్‌ మాట్లాడుతూ పద్మశాలీలు ఐక్యంగా ఉండాలన్నారు. సంఘం పూర్వ వరంగల్‌ జిల్లా అధ్యక్షుడు కోడం రవిప్రకాశ్‌ ఆధ్వర్యాన జరిగిన ఈ కార్యక్రమంలో వరంగల్‌ జిల్లా సెకండ్‌ క్లాస్‌ మేజిస్ట్రేట్‌ గుర్రం వీరస్వామి ప్రసంగించగా.. పద్మశాలి ఎన్పీడీసీఎల్‌ సీజీఎం టి.మధుసూదన్‌, ప్రెస్‌క్లబ్‌ అధ్యక్షుడు వేముల నాగరాజు, సీనియర్‌ జర్నలిస్టు గడ్డం కేశవమూర్తి, ఆయా పద్మశాలీ సంఘాల నాయకులు కుసుమ సత్యనారాయణ, లకుం నవీన్‌ రాజకుమార్‌, దేవులపల్లి రాఘవేందర్‌, బింగి సురేశ్‌, వంగరి సూర్యనారాయణ, కొండబత్తుల రాజమౌళి, పిట్ట ఉమాదేవి, శ్రీనివాస్‌, బొద్దున వెంకటేశ్వర్లు, ఆడెపు నాగరాజు, గుర్రపు రాజమౌళి, కూచన రాజు, సిరిమల్లె లింగమూర్తి, చిందం లింగమూర్తి, దేవులపల్లి సాయిరాజ్‌, బూర రజిత, మాచర్ల శివప్రసాద్‌, గుర్రపు మధుమోహన్‌, కుడికాల సత్యనారాయణ, కందగట్ల రామాకాంత్‌ పాల్గొన్నారు.



సన్మానం పొందిన పద్మశాలి ఉద్యోగులు, జర్నలిస్టులతో నాయకులు

27న మోషన్‌ టాలెంట్‌ సెర్చ్‌ ఎగ్జామ్‌



మాట్లాడుతున్న వేణుగోపాల్‌ గౌడ్‌

- 10వ తరగతి విద్యార్థులకు రూ.150 కోట్ల స్కాలర్‌షిప్‌, రూ.2 కోట్ల ప్రైజ్‌ మనీ
- మోషన్‌ ఐఐటీ, నీట్‌ ఇన్‌స్టిట్యూట్‌ హనుమకొండ చైర్మన్‌ వేణుగోపాల్‌ గౌడ్‌

హన్మకొండ: పదోతరగతి విద్యార్థులకు ఈ నెల 27వ తేదీన మోషన్‌ టాలెంట్‌ సెర్చ్‌ టెస్ట్‌ నిర్వహిస్తున్నట్లు మోషన్‌ ఐఐటీ, నీట్‌ ఇన్‌స్టిట్యూట్‌ హనుమకొండ చైర్మన్‌ వడ్లకొండ వేణుగోపాల్‌ గౌడ్‌ తెలిపారు. ఈ మేరకు ఆదివారం హనుమకొండ నయింనగర్‌లోని మోషన్‌ ఇన్‌స్టిట్యూట్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రస్తుత విద్యా సంవత్సరంలో 10వ తరగతి చదువుతున్న విద్యార్థులకు ఈ నెల 27న మోషన్‌ ఇన్‌స్టిట్యూట్‌లో టాలెంట్‌ సెర్చ్‌ టెస్ట్‌ నిర్వహిస్తున్నామన్నారు. రాజస్థాన్‌ కోటాలోని మోషన్‌ ఐఐటీ, నీట్‌ వారు దేశ వ్యాప్తంగా ఈ టెస్ట్‌ నిర్వహిస్తున్నారని వివరించారు. ఇందులో ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు రూ.150 కోట్ల స్కాలర్‌ షిప్‌, రూ.2 కోట్ల ప్రైజ్‌ మనీ, ఐదువందల మంది విద్యార్థులకు ఇంటర్‌లో ఉచితంగా విద్య అందిస్తారని వివరించారు. ఐదుగురు విద్యార్థులకు ఫీజులో 50 శాతం రాయితీ అందిస్తారన్నారు. మొదటి ర్యాంకు సాధించిన విద్యార్థికి ల్యాప్‌టాప్‌, రెండో ర్యాంక్‌ సాధించిన విద్యార్థికి ట్యాబ్‌తో పాటు దాదాపు రూ.లక్ష విలువైన ప్రైజ్‌ మనీ అందిస్తారన్నారు. ఈ నెల 27న ఉదయం 11 నుంచి 12 గంటల వరకు పరీక్ష జరుగుతుందన్నారు. ఫిజిక్స్‌, కెమిస్ట్రీ, గణితం, బయోసైన్స్‌, మెంటల్‌ ఎబిలిటీ సిలిబస్‌పై 31 ప్రశ్నలుంటాయని, 124 మార్కులతో ఈ ప్రశ్నాపత్రం ఉంటుందన్నారు. ఈ అవకాశాన్ని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. వివరాలకు హనుమకొండ, నయింనగర్‌లోని మోషన్‌ ఐఐటీ, నీట్‌ ఇన్‌స్టిట్యూట్‌లో గాని లేదా 9703000850, 9703000851, 9703000852 నంబర్లకు కాల్‌ చేసి ఫ్రీ రిజిస్ట్రేషన్‌ చేసుకోవాలన్నారు. సమావేశంలో మోషన్‌ ఇన్‌స్టిట్యూట్‌ డైరెక్టర్‌ పెరుమాండ్ల అనిల్‌ గౌడ్‌, హెడ్‌ ముత్యాల సురేశ్‌, అడ్మినిస్ట్రేషన్‌ ఆఫీసర్‌ బి.మురళి, మార్కెటింగ్‌ మేనేజర్‌ శనిగరపు సుమన్‌, మార్కెటింగ్‌ టీం సభ్యులు తాళ్లపల్లి రమేశ్‌ గౌడ్‌, పాక నాగరాజు, రచ్చ కుమార్‌, రవీందర్‌ రావు పాల్గొన్నారు.

ఉరేసుకుని వ్యక్తి ఆత్మహత్య



విజయ్‌ (ఫైల్‌)

స్టేషన్‌ఘన్‌పూర్‌ : మండలంలోని తాటికొండ గ్రామానికి చెందిన ఆటోడ్రైవర్‌ మారపాక విజయ్‌(35) కడుపునొప్పి భరించలేక ఆత్మహత్య చేసుకున్న సంఘటన ఆదివారం జరిగింది. మృతుడి తల్లి మారపాక కళ స్థానిక పోలీసులకు అందించిన వివరాల ప్రకారం.. విజయ్‌ ఆటోడ్రైవర్‌గా పనిచేస్తూ కుటుంబాన్ని పోషిస్తున్నాడు. కాగా ఇటీవల తరుచూ కడుపునొప్పితో బాధపడుతున్నాడు. ఆస్పత్రిలో చూపించుకున్నా తగ్గక పోవడంతో మనస్తాపానికి గురయ్యేవాడు. దాంతో కడుపునొప్పి భరించలేక ఆదివారం తమ ఇంట్లో ఎవరూ లేని సమయంలో దూలానికి ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. విషయం తెలుసుకున్న పోలీసులు ఘటనా స్థలికి చేరుకుని శవ పంచనామా నిర్వహించి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఆస్పత్రికి తరలించారు. మృతుడి తల్లి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ జి.వేణు తెలిపారు.

బయ్యారంలో వ్యక్తి ..

బయ్యారం: ఓ వ్యక్తి ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఈ ఘటన కొత్తపేటలో చోటుచేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం.. బయ్యారం మండలం కొత్తపేట ఎస్సీ కాలనీకి చెందిన మరికంట శేఖర్‌ (41) ట్రాక్టర్‌ డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. 3 రోజుల నుంచి మద్యం సేవిస్తూ తరచూ భార్య, కొడుకులతో గొడవ పడ్డాడు. ఆదివారం ఉదయం ఉరేసుకున్నాడు. కొడుకు చూసి కేకలు వేయడంతో చుట్టుపక్కల వారు వచ్చి శేఖర్‌ను కిందకు దింపగా అప్పటికే మృతిచెందాడు. మృతుడి భార్య రమణ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై కె తిరుపతి వెల్లడించారు.

తల్లి మందలించిందని పెద్దగంగారంలో యువతి..

వాజేడు: తల్లి మందలించిందనే కారణంతో చెరువులో దూకి ఓ యువతి ఆత్మహత్యకు పాల్పడింది. ఈ ఘటన వాజేడు మండలంలోని పెదగంగారంలో శనివారం చోటు చేసుకోగా ఆదివారం ఆలస్యంగా వెలుగు చూసింది. పేరూరు ఎస్సై గుర్రం కృష్ణ ప్రసాద్‌ కథనం ప్రకారం.. గ్రామానికి చెందిన ఆలం ధనలక్ష్మి, ఆంజనేయులు దంపతుల కూతురు స్వప్న (22) వరంగల్‌లోని ఓ ప్రైవేట్‌ కళాశాలలో డీఎంఎల్‌టీ మొదటి సంవత్సరం చదువుతోంది. దసరా సెలవులకు ఇంటికి వచ్చిన సమయంలో కూతురు ప్రేమ వ్యవహారం తెలియడంతో తల్లిదండ్రులు మందలించారు. మనస్తాపానికి గురైన స్వప్న శనివారం తెల్లవారుజామున బయటకు వెళ్లింది. కూతురు ఎంతకూ ఇంటికి రాకపోవడంతో తల్లిదండ్రులు ఇంటి సమీపంలో ఉన్న చెరువు వద్దకు వెళ్లి చూడగా గట్టుపై చెప్పులు, చున్నీ, సెల్‌ ఫోన్‌ కనిపించాయి. దీంతో చుట్టుపక్కల వారి సహకారంతో చెరువులోకి దిగి గాలించగా స్వప్న మృతదేహం లభించింది. స్థానికులు పోలీసులకు సమాచారం ఇవ్వడంతో ఘటనా స్థలికి చేరుకున్న పోలీసులు మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఏటూరునాగారం సివిల్‌ ఆస్పత్రికి తరలించారు. ఈ ఘటనపై కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై కృష్ణ ప్రసాద్‌ తెలిపారు.

అంతర్జాతీయ క్రికెట్‌ స్టేడియానికి కృషి

- ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి
- అట్టహాసంగా ఆరు జిల్లాల క్రికెట్‌ పోటీలు ప్రారంభం

వరంగల్‌ స్పోర్ట్స్‌ : వరంగల్‌ నగరంలో అంతర్జాతీయ స్థాయి క్రికెట్‌ స్టేడియం నిర్మించాలని సీఎం రేవంత్‌రెడ్డి దృష్టిలో ఉందని, అందుకు తన వంతుగా వీలైనంత త్వరలో స్టేడియం ఏర్పాటుకు కృషి చేస్తానని వరంగల్‌ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి అన్నారు. వరంగల్‌ క్రికెట్‌ అసోసియేషన్‌ ఆధ్వర్యంలో హనుమకొండ రెడ్డిపురంలోని టీవీవీ సుకాంత్‌ స్టేడియంలో జరుగుతున్న ఉమ్మడి వరంగల్‌ పరిధిలోని ఆరు జిల్లాల స్థాయి అండర్‌–23 క్రికెట్‌ పోటీలను ఆదివారం ఎమ్మెల్యే నాయిని ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు. వరంగల్‌ నగరంలో క్రికెట్‌ అభివృద్ధి హైదరాబాద్‌కు దీటుగా ఉందని, ఇక్కడి ప్రతిభ గల క్రీడాకారులకు కొదవలేదన్నారు. కార్యక్రమంలో కార్పొరేషన్‌ ఫ్లోర్‌ లీడర్‌ తోట వెంకటేశ్వర్లు, వరంగల్‌ క్రికెట్‌ అసోసియేషన్‌ జిల్లా కార్యదర్శి చాగంటి శ్రీనివాస్‌, అధ్యక్షుడు పెద్ది ప్రవీణ్‌, ఉపాధ్యక్షుడు రఘురాం, సంయుక్త కార్యదర్శి ఉపేందర్‌, మాజీ అధ్యక్షుడు అచ్చ వెంకటేశ్వర్‌రావు, కార్యవర్గ సభ్యులు అభినవ్‌వినయ్‌, తోట రాము, మట్టెడ కుమార్‌ తదితరులు పాల్గొన్నారు.



పోటీలను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే నాయిని

మహబూబాబాద్‌ విజయం..

మొదటి రోజు వరంగల్‌, మహబూబాబాద్‌ జట్ల మధ్య జరిగిన మ్యాచ్‌లో టాస్‌ గెలిచి బ్యాటింగ్‌ ఎంచుకున్న వరంగల్‌ నిర్ణీత 30 ఓవర్లకు గానూ 29.3 ఓవర్లు ఎదుర్కొని 123 పరుగుల వద్ద అన్ని వికెట్లు కోల్పోయింది. అనంతరం బ్యాటింగ్‌ బరిలోకి దిగిన మహబూబ్‌బాద్‌ 30 ఓవర్లు ఎదుర్కొని 8 వికెట్ల నష్టానికి 124 పరుగులు చేసి విజయం సాధించింది. మొగిలిచర్ల క్రీడా మైదానంలో హనుమకొండ, జనగామ జట్ల మధ్య జరిగిన మ్యాచ్‌లో టాస్‌ గెలిచి బ్యాటింగ్‌ ఎంచుకున్న హనుమకొండ నిర్ణీత 50 ఓవర్లకు గానూ 10 వికెట్లు కోల్పోయి 307 పరుగుల భారీ స్కోరు చేసింది. అనంతరం బ్యాటింగ్‌ చేసిన జనగామ జట్టు కేవలం 27 ఓవర్లు ఎదుర్కొని 128 పరుగుల వద్ద అన్ని వికెట్లను కోల్పోయింది. దీంతో హనుమకొండ 179 పరుగుల తేడాతో విజయం సాధించింది.

అనుమానాస్పద స్థితిలో యువకుడి మృతి

గార్ల : అనుమానాస్పద స్థితిలో ఓ యువకుడు మృతిచెందిన సంఘటన ఆదివారం సీతంపేటలో చోటుచేసుకుంది. బాధిత కుటుంబ సభ్యులు, పోలీసుల కథనం ప్రకారం.. మండలంలోని సీతంపేట గ్రామానికి చెందిన గుమ్మడి మహేశ్‌ (32) స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో కాంట్రాక్ట్‌ పద్ధతిలో కంప్యూటర్‌ ఆపరేటర్‌గా విధులు నిర్వర్తిస్తూ, ఇంట్లో ఒక్కడే నివాసం ఉంటున్నాడు. రాత్రి స్నేహితులతో కలిసి మాట్లాడిన తర్వాత ఇంటికి వెళ్లాడు. ఉదయం మహేశ్‌ నిద్ర లేవకపోగా, ఇంటి తలుపులు తీసి ఉన్నాయి. ఇంటి పక్కన వారు వెళ్లి చూడగా మహేశ్‌ మంచంపై విగతజీవిగా పడి ఉన్నాడు. అతడి చేతికి, శరీరంపై కొట్టిన గాయాలు, నోటి నుంచి రక్తం కారుతున్నట్లు కనిపించాయి. దీంతో మహేశ్‌ను ఎవరో కొట్టి చంపారని స్థానికులు పేర్కొంటున్నారు. వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వగా బయ్యారం సీఐ బి.రవికుమార్‌, ఎస్సై ఎస్‌.జీనత్‌కుమార్‌ ఘటనా స్థలిని సందర్శించి స్థానికులను విచారించారు.



మహేశ్‌ (ఫైల్‌)

ఇంటి వెనుక వాళ్లే కొట్టి చంపారని అనుమానం: మృతుడి తమ్ముడు రాజు

ఇంటి వెనుక ఉన్న ఓ వివాహితతో మహేశ్‌కు గతంలో అక్రమ సంబంధం ఉందనే అనుమానంతో వాళ్లే మా అన్నను అతి కిరాతకంగా కొట్టి చంపినట్లు అనుమానంగా ఉందని తమ్ముడు గుమ్మడి రాజు పోలీసులకు ఫిర్యాదు చేశాడు. వారు ఉదయమే తమ ఇంటికి తాళం వేసి వెళ్లిపోయినట్లు స్థానికులు పేర్కొంటున్నారు. ఈ ఘటనపై మృతుడి తమ్ముడు రాజు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం మహబూబాబాద్‌ ఏరియా ఆస్పత్రికి తరలించి కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై జీనత్‌కుమార్‌ తెలిపారు.

బస్సును ఓవర్‌టేక్‌ చేసే క్రమంలో..

టాటా ఏస్‌ వాహనాన్ని ఢీకొన్న బైక్‌

- ఇద్దరి దుర్మరణం.. ముగ్గురికి గాయాలు
- సూర్యాపేట రహదారిపై ఘటన



నుజ్జునుజ్జయిన టాటా ఏస్‌





భరత్‌, నర్సింహ మృతదేహాలు

దేవరుప్పుల : బస్సును ఓవర్‌టేక్‌ చేసే క్రమంలో జనగామ–సూర్యాపేట రహదారిపై ఘోర రోడ్డు ప్రమాదం జరిగింది. బైక్‌ ఎదురుగా వస్తున్న టాటా ఏస్‌ను ఢీకొంది. ఈ ఘటనలో ఇద్దరు యువకులు దుర్మరణం చెందగా ముగ్గురు తీవ్రంగా గాయపడ్డారు. ఎస్సై సృజన్‌కుమార్‌ కథనం ప్రకారం.. ఆంధ్రప్రదేశ్‌లోని కర్నూల్‌ జిల్లా మొగిత గ్రామానికి చెందిన బోయ నర్సింహ (20), తెలంగాణలోని వనపర్తి జిల్లా మదనాపురం గ్రామానికి చెందిన చీరోల్‌ భరత్‌(22) కొడకండ్ల మండలం రామన్నగూడెంలో ఓ ఇంట్లో ప్లంబింగ్‌ పనులు చేస్తున్నారు. పని నిమిత్తం ఆదివారం ఉదయం బైక్‌పై దేవరుప్పుల మండల కేంద్రానికి వస్తున్నారు. ఈ క్రమంలో సూర్యాపేట రహదారి గొల్లపల్లి బస్‌స్టేజీ సమీపంలో జనగామ వైపునకు వెళ్తున్న ఆర్టీసీ బస్సును ఓవర్‌టేక్‌ చేసే క్రమంలో ఎదురుగా టాటా ఏస్‌ వాహనాన్ని ఢీకొన్నారు. దీంతో నర్సింహ, భరత్‌ రహదారిపై ఎగిరిపడి అక్కడికక్కడే దుర్మరణం చెందారు. టాటాఏస్‌లో ప్రయాణిస్తున్న సింగరాజుపల్లికి చెందిన రాపాక ఉప్పలయ్య, రేణుక దంపతులు, కొంగరి భాస్కర్‌కు తీవ్రగాయాలయ్యాయి. దీంతో స్థానికులు క్షతగాత్రులను అంబులెన్స్‌లో జనగామ ఏరియా ఆసుపత్రికి తరలించారు. ఘటనా స్థలిలో లభించిన సెల్‌ ఫోన్‌ల ఆధారంగా పోలీసులు మృతులను గుర్తించి పోస్టుమార్టం నిమిత్తం జనగామ ఏరియా ఆసుపత్రికి తరలించారు. ఆదివారం రాత్రి వరకు మృతులు కుటుంబీకులు రానున్నట్లు ఎస్సై పేర్కొన్నారు. కాగా, బతుకుదెరువు కోసం సుదూర ప్రాంతాల నుంచి వచ్చిన ఇద్దరు యువకులు రోడ్డు ప్రమాదంలో దుర్మరణం చెందడంపై పలువురు కన్నీరుమున్నీరయ్యారు.

ఆర్యవైశ్యుల ‘బతుకమ్మ పట్టీ’



బతుకమ్మలతో ఆర్యవైశ్య మహిళలు

దేవరుప్పుల : కొత్త దంపతులకు సారెపట్టీ పోసే మాదిరి ఆర్యవైశ్యులు వినూత్నంగా బతుకమ్మ పట్టీ ఆడారు. ఆదివారం రాత్రి మండలంలోని సీతారాంపురం గ్రామానికి చెందిన కందుకూరి రవి, రజిత దంపతుల ఆధ్వర్యంలో తొమ్మిది రకాల పూలతోపాటు పండ్లు, కూరగాయలు, ముత్యాలు, పౌడాలు, వెండి తదితర ఆభరణాలతో ప్రత్యేక బతుకమ్మలను తయారు చేశారు. అనంతరం బంధుమిత్రులు, గ్రామ మహిళలతో కలిసి బతుకమ్మ ఆడారు.



సీతారాంపురంలో వినూత్నంగా తయారు చేసిన బతుకమ్మ పట్టీలు